

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684


**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 04.08.2025 | సంపుటి : 2 | సంచిక :182 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 04.08.2025 | volume : 2 | Issue : 182 | Pages : 8 | Cost : 2/- |



## సీఎం రేవంత్‌రెడ్డితో చిరంజీవి భేటీ

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో ఆదివారం నటుడు చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు చిరంజీవి పుష్పగుచ్ఛం అందజేయగా.. చిరంజీవికి సీఎం శాలువా కప్పి సత్కరించారు. సినీ పరిశ్రమ అభివృద్ధిపై ఇరువురూ చర్చించారు.



# కాళేశ్వరం నివేదికపై ప్రభుత్వం దృష్టి

- అధ్యయనం పూర్తి చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ
- కమిటీతో సమావేశమైన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్
- జస్టిస్ ఘోష్ నివేదిక.. అధికారుల కమిటీ సిఫార్సులపై నేడు మంత్రివర్గ సమావేశం
- తదుపరి చర్యలకు సీపీడీకి బాధ్యతలు?

కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణాలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక మొదలు నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు అనేక లోపాలు, అక్రమాలు జరిగినట్లు తెలపడమే కాక ఏ వైఫల్యానికి ఎవరు బాధ్యులో కూడా కమిషన్ పేర్కొంది. న్యాయ విచారణ కమిషన్‌లు నివేదికలు ఇచ్చినపుడు గతంలో ఏ రాష్ట్రంలో ఎలా చేశారు? తదుపరి కార్యచరణ ఏమిటన్న దానిపై మంత్రుల్లో ఇప్పటికే చర్చ జరుగుతున్నా.. సోమవారం మధ్యాహ్నం నిర్వహించే మంత్రివర్గ అత్యవసర సమావేశం జస్టిస్ ఘోష్ నివేదికపై సమగ్రంగా చర్చించనుంది. నివేదికను పరిశీలించి ముఖ్యమైన సిఫార్సులను మంత్రివర్గం ముందు ఉంచడానికి సీఎం రేవంత్‌రెడ్డి ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

**హైదరాబాద్, ఆగస్టు 3:** కమిషన్ ఇచ్చిన 700 పేజీల నివేదికను అధ్యయనం చేసిన కమిటీ పలు అంశాలపై ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. వ్యక్తిగత నిర్ణయాలు, రాజకీయ నాయకత్వ ప్రభావంతో పరిపాలన.. ప్రణాళికల్లో అనేక లోపాలు జరిగాయని, సాంకేతిక అంశాలను విస్మరించారని కమిషన్ నివేదిక తెలిపిందని కమిటీ అభిప్రాయ పడినట్లు సమాచారం. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిటీలోని అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సాధారణ పరిపాలన ఇన్‌ఛార్జి ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, నీటిపారుదల ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతితో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కమిషన్ నివేదికలోని ముఖ్య అంశాలపై వారు చర్చించినట్లు తెలిసింది.

మిగతా 2 లో



## ఆపరేషన్ సిందూర్‌తో సత్తా చాటిన భారత్

- దేశీయంగానే డ్రోన్లు, క్షిపణుల అభివృద్ధి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ఆపరేషన్ సిందూర్‌లో భాగస్వామ్యమైన రక్షణ రంగ శాస్త్రవేత్తలకు సత్కారం

02



02

## సర్కారు నిర్ణయాలపై ఏం చేద్దాం..?

- ఫాంహౌస్‌లో పార్టీ నేతలతో కేసీఆర్ భేటీ
- కాళేశ్వరం కమిషన్ నివేదికపై ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందన్న దానిపై చర్చ
- కవిత వ్యవహారం, బీసీ రిజర్వేషన్ల అంశంపైనా సమాలోచనలు
- నేడు కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శనకు బీఆర్ఎస్ నేతలు



02

## దేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత రంగం కీలకం

- రూ.10 లక్షల కోట్ల చేనేత ఎగుమతులే లక్ష్యం
- జాతీయ చేనేత దినోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## 'కాళేశ్వరం' నిర్మాణ లోపాలను ప్రజల ముందుంచుతాం

### 'బనకచర్ల'పై ఎంతవరకైనా పోరాడతాం

### ముర్మూర్ ఎత్తిపోతల ప్రారంభోత్సవంలో మంత్రి ఉత్తమ్

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వాస్తవాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందజేసిందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నివేదికను మంత్రివర్గం ముందుంచి.. ప్రాజెక్టు నిర్మాణ లోపాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం వద్ద గోదావరిపై రూ.75 కోట్లతో నిర్మించిన ముర్మూర్ ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం ఆయన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులతో కలిసి ప్రారంభించారు.



02



## ఆమె గురించి మాట్లాడటం వృధా అని కేసీఆర్‌కు చెప్పా

- కేసీఆర్ బద్ధ శత్రువుల మాటలే ఆమె మాట్లాడుతున్నారు
- కేసీఆర్ లేకపోతే మేమెవరమూ లేం..
- ఎమ్మెల్సీ కవితపై జగదీశ్‌రెడ్డి విసుర్లు

02

## నాపై వ్యాఖ్యల వెనుక పెద్ద నాయకుడి హస్తం

- నల్గొండ జిల్లా మాజీ మంత్రి నా గురించి మాట్లాడుతున్నారు
- ఆ జిల్లాలో బీఆర్ఎస్‌ఓటమికి కారణం ఆయనే
- ఎమ్మెల్సీ కవిత ఆరోపణలు
- 72 గంటల దీక్ష చేస్తానని స్పష్టీకరణ

బీఆర్ఎస్‌లోని పెద్ద నాయకుల తీరుపై కొన్ని నెలలుగా అసంతృప్తి వ్యక్తంచేస్తూ వస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నేరుగా పేర్లు ప్రస్తావించకుండా.. పరోక్షంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిలను ఉద్దేశించి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఓ పెద్ద నాయకుడు ఇంటి ఆడబిడ్డనని కూడా చూడకుండా తనపై నీచంగా, అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారని ఆరోపించారు. పెద్ద నాయకుడి అండతో సొంత పార్టీ నేతలే తనను ఇబ్బంది పెడుతున్నారని.. ఇవన్నీ ఆషామాషీగా చెప్పడం లేదని, ఆవేదనతో చెబుతున్నానని పేర్కొన్నారు.



02



02

## రైతుల హక్కులను కాపాడుకుంటాం

మంత్రి పొన్నం

## సౌర విద్యుత్ కోసం స్టోరేజ్ వ్యవస్థ

- ఇరవయ్యేళ్ల డిమాండ్‌కు తగిన ప్రణాళికలు సిద్ధం చేయండి
- జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి

జల విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజ్‌తో పెద్ద ఎత్తున విద్యుదుత్పత్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని.. అందుకోసం రాష్ట్రంలో 23 పాయింట్లను గుర్తించి వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల గ్రామంలోని టూరిజం అతిథి గృహంలో జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.





02

## ఆదివాసీల ప్రేమ అచంచలం

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్



## ‘కాళేశ్వరం’ నిర్మాణ లోపాలను ప్రజల ముందుంచుతాం

- ‘బనకచర్ల’పై ఎంతవరకైనా పోరాడతాం
- ముర్మూర్ ఎత్తిపోతల ప్రారంభోత్సవంలో మంత్రి ఉత్తమ్

**కరీంనగర్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వాస్తవాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందజేసిందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నివేదికను మంత్రివర్గం ముందుంచి.. ప్రాజెక్టు నిర్మాణ లోపాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం వద్ద గోదావరిపై రూ.75 కోట్లతో నిర్మించిన ముర్మూర్ ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం ఆయన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఉత్తమ్ మాట్లాడారు. “ఏపీ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతవరకైనా పోరాడతాం. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి నేను పలుమార్లు చేసిన విజ్ఞప్తులు, అభ్యంతరాల మేరకే బనకచర్ల అనుమతులను సీడబ్ల్యూసీ, గోదావరి యాజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ తిరస్కరించాయి. కొందరు కావాలనే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళ్తున్నారు. త్వరలోనే తుమ్మిడిహెట్టి, ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టులు నిర్మించి తెలంగాణ వాటాగా 968 టీఎంసీలను వినియోగించుకుంటాం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునాదులు బలహీనంగా ఉండటం వల్లే నీటిని నిల్వ చేయలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మేలుచేసేలా పత్తిపాక ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడతాం. దేశంలో ఎక్కడాలేనివిధంగా రాష్ట్ర జనాభాలో 84% మందికి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో 89 లక్షల రేషన్‌కార్డులుండగా మేం అధికారంలోకి వచ్చాక కొత్తగా 8.64 లక్షల మందికి జారీచేశాం” అని ఉత్తమ్ పేర్కొన్నారు. అనంతరం పెద్దపల్లి జిల్లా ధర్మారం, కరీంనగర్ జిల్లా షానగర్, కేశవపట్నంలలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాలకు మంత్రులు హాజరయ్యారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## దేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత రంగం కీలకం

- రూ.10 లక్షల కోట్ల చేనేత ఎగుమతులే లక్ష్యం
- జాతీయ చేనేత దినోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ :** రానున్న ఐదేళ్లలో చేనేత ఎగుమతులను రూ.10 లక్షల కోట్లకు తీసుకెళ్లడమే లక్ష్యంగా రాష్ట్రాలతో కలిసి కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మాదాపూర్ శిల్పారామంలో ఆదివారం కేంద్ర చేనేత శాఖ, హైదరాబాద్ వీవర్స్ సర్వీస్ సెంటర్, శిల్పారామం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ‘దేశ ఎగుమతుల్లో చేనేతవే 13 శాతం. వాటి విలువ రూ.3లక్షల కోట్లుగా ఉంది. దేశ జీడీపీలో భాగస్వామ్యాన్ని ఇప్పుడున్న 2.6 నుంచి 5 శాతానికి పెంచుకోవాలి. ప్రతి నేతన్న ఇందులో భాగస్వామి కావాలి. గతంలో 7 మెగా టెక్స్‌టైల్ పార్కుల కోసం కేంద్ర క్యాబినెట్ తీర్మానం చేయగా అందులో ఒకటి రాష్ట్రానికి కేటాయించాం. వరంగల్‌లో ఏర్పాటు చేయించిన ఆ పార్కులో రూ.వేల కోట్ల పెట్టుబడులు, 2 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుంది. హ్యాండ్లూమ్ హబ్‌గా రాష్ట్రం మారుతోంది. చేనేత, అనుబంధ రంగాల్లో 48వేల మంది పనిచేస్తున్నారు. రాష్ట్రంలో పోచంపల్లి ఇక్కత్, గద్వాల, సిద్దిపేట గొల్లభామ చీరలు, నారాయణ్‌ఖేడ్ కాటన్ చీరలు, వరంగల్ తివాచీలు తదితర ఉత్పత్తులకు కేంద్రం జియో ట్యాగింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. తద్వారా వాటిని తయారు చేసే కార్మికుడి వివరాలు కొనుగోలుదారులకు తెలుస్తాయి. వారానికి ఒకసారి చేనేత దుస్తులను ధరించి నేతన్నలను ప్రోత్సహించాలి’ అని కేంద్ర మంత్రి అన్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కళాకారులను సన్మానించారు. పెన్షన్ అవార్డీలకు ధ్రువపత్రాలు అందజేశారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర, మగ్గాల ప్రదర్శనను మంత్రి తిలకించారు. నిఫ్ట్ డైరెక్టర్ మాలిని, శిల్పారామం ప్రత్యేకాధికారి కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల హక్కులను కాపాడుకుంటాం : మంత్రి పొన్నం

**హైదరాబాద్:** రాష్ట్ర ప్రయోజనాల కోసం, రైతుల హక్కుల కోసం నిర్భయంగా తాము మాట్లాడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వరద జలాల పేరు మీద ప్రాంతీయ అసమానతలు రెచ్చగొడుతున్నారని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అనడం తగదని ఆదివారం విడుదల చేసిన వీడియో ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నీటి లభ్యతలో తెలంగాణకు 968 టీఎంసీలు, ఏపీకి 531 టీఎంసీలు ఇచ్చిన తరువాతే వరద జలాల గురించి ఆలోచించాలని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రజలకు సంబంధించిన హక్కుల ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నీటిలో ఒక చుక్క కూడా వదులుకోబోం అని ఆయన స్పష్టం చేశారు.

# కాళేశ్వరం నివేదికపై ప్రభుత్వం దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక అవకతవకలు, నిబంధనలకు తూట్లు పొడవడంతో పాటు నిర్మాణ సంస్థతో ప్రాజెక్టు అధికారులు కుమ్మక్కయ్యారని..మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో భారీగా ప్రజాధనం దుర్వినియోగమైందని చెబుతూ ఇందులో ఎవరెవరి పాత్ర ఏమిటో న్యాయ కమిషన్ వివరంగా పేర్కొన్నట్లు తెలిసింది. గత ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌తో పాటు ఐఏఎస్ అధికారులు, సీనియర్ ఇంజినీర్లు ఇలా అనేక మంది పాత్ర గురించి కమిషన్ తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తున్న నేపథ్యంలో మంత్రివర్గం తీసుకొనే నిర్ణయాలు..తదుపరి కార్యాచరణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించాలన్నది ప్రభుత్వ నిర్ణయం కాదని, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులు వ్యక్తిగతంగా తీసుకొన్నట్లు పేర్కొనడంతో పాటు బ్యారేజీలు దెబ్బతినడానికి నాటి నిర్ణయాలే కారణమని జస్టిస్ ఘోష్ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. మంత్రివర్గ అనుమతి లేకపోవడం, తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని బ్యారేజీల నిర్మాణ స్థలాన్ని మార్చడం, అంచనాల సవరింపులో అవకతవకలు, నిర్వహణ సరిగా లేకపోవడం, నీటిని మళ్లించడానికి నిర్మించిన బ్యారేజీలలో నీటిని నిత్యం నిల్వ ఉంచడం, నిపుణుల కమిటీ నివేదికను పక్కనపెట్టడం, డిజైన్లలో లోపాలు, నాణ్యతా తనిఖీలు లేకపోవడం, పని పూర్తికాకుండానే పూర్తయినట్లు సర్టిఫికెట్ ఇవ్వడం ఇలా అనేక అంశాలను కమిషన్ ప్రస్తావించినట్లు తెలిసింది. ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకొన్నారని అప్పటి ఆర్థికమంత్రి ఈటల రాజేందర్‌ను కూడా కమిషన్ తప్పు పట్టినట్లు సమాచారం. వీరితోపాటు మాజీ ప్రధాన కార్యదర్శి, కాళేశ్వరం నిర్మాణ సమయంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎస్.కె.జోషి, ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా ఉంటూ ప్రాజెక్టును పర్యవేక్షించిన స్మితాసభర్వాల్‌తో పాటు మాజీ ఈఎన్సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, నాగేందర్‌రావు, నరేందర్‌రెడ్డి, మాజీ సీఈలు చంద్రశేఖర్, బసవరాజు.. ఈఎన్సీలు టి.శ్రీనివాస్, హరిరాం, సీఈలు సుధాకర్‌రెడ్డి, ప్రమీల తదితరుల పాత్ర గురించి వెల్లడించినట్లు తెలిసింది. వాప్కోస్ సంస్థకు డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీ కింద ఇచ్చిన రూ.6.77 కోట్లను తిరిగి వసూలు చేయాలని కూడా కమిషన్ సూచించినట్లు సమాచారం. ఈ నేపథ%రి%ంలో సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో తీసుకొనే నిర్ణయం కీలకం కానుంది. తదుపరి చర్యలకు సీఐడీకి ఇచ్చే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతుంది. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ (కె.ఐ.పి.సి.ఎల్) ద్వారా ఆర్థిక అవకతవకలు జరిగాయని పేర్కొన్న న్యాయ కమిషన్.. దీనికి బోర్డు సభ్యులు బాధ్యులని.. బోర్డులో ఉన్న నీటిపారుదల, ఆర్థికశాఖ అధికారులపై క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్ కింద చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. కార్పొరేషన్ ఎండీగా ఉంటూ కేంద్ర జల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చారని, బ్యారేజీల గురించి తనకు ఏమీ తెలియదని చెప్పారంటూ కాళేశ్వరం మాజీ ఈఎన్సీ హరిరాం గురించి కమిషన్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

## నాపై వ్యాఖ్యల వెనుక పెద్ద నాయకుడి హస్తం

- నల్గొండ జిల్లా మాజీ మంత్రి నా గురించి మాట్లాడుతున్నారు
- ఆ జిల్లాలో భారత రాష్ట్ర సమితి ఓటమికి కారణం ఆయనే
- ఎమ్మెల్సీ కవిత ఆరోపణలు
- 72 గంటల దీక్ష చేస్తానని స్పష్టీకరణ



**హైదరాబాద్, ఆగస్టు 3 :** “నాపై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ సమాజమంతా స్పందించింది. అయినప్పటికీ ఇంటి ఆడబిడ్డపై చేసిన వ్యాఖ్యలకు భారత రాష్ట్ర సమితి సోదరులు మాత్రం స్పందించలేదు. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. నాపై చేస్తున్న వ్యాఖ్యల వెనుక భారత రాష్ట్ర సమితి పార్టీ పెద్ద నాయకుడి హస్తం ఉంది. ఆయన మా జాగృతిలో కొందరు కోవర్టులను పెట్టి.. ఇక్కడి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. నాపై కొందరు వ్యాఖ్యలతో దాడి చేస్తున్నా.. ఆయన ఆదేశాల కారణంగానే భారత రాష్ట్ర సమితి నేతలు స్పందించడం లేదనే స్పష్టమైన సమాచారం నాకుంది” అని ఆ పార్టీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ‘ఉమ్మడి నల్గొండ జిల్లాలో భారత రాష్ట్ర సమితి పార్టీ ఓటమికి కారణమైన ఆ పార్టీ నాయకుడు, మాజీ మంత్రి నా గురించి మాట్లాడుతున్నారు. ఆయనను ప్రోత్సహిస్తున్న దెవరు? ఉమ్మడి నల్గొండలో భారత రాష్ట్ర సమితి సర్వనాశనం కావడానికి, 11 నియోజకవర్గాల్లో ఓటమికి కారణం ఆయనే. కేసీఆర్ లేకపోతే అసలు ఆయనెవరు?’ అని కవిత ప్రశ్నించారు. ‘భాజపా ఎంపీ సీఎం రమేశ్ ఎందుకు మాట్లాడారో నాకు తెలియదు. అయితే ఆయన వ్యాఖ్యలకు.. నేను కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అవడానికి మాత్రం సంబంధం ఉంది’ అని ఆమె స్పష్టం చేశారు. ‘నాకు ఎవరి మద్దతు లేదు. మ్యాచ్ ఫిక్సింగ్ వాళ్లకే అలవాటు. మ్యాచ్ ఫిక్సింగ్ చేసేవారే.. కవిత వెనక ప్రభుత్వం ఉందంటే ఎలా?’ అని ఆమె ప్రశ్నించారు. ‘ఇందిరాపార్కు వద్ద సోమవారం నుంచి 72 గంటల నిరాహారదీక్షను గాంధేయమార్గంలో శాంతియుతంగా చేయనున్నాం. ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే.. నన్ను ఎక్కడ ఉంచితే అక్కడే దీక్షను కొనసాగిస్తాం’ అని కవిత స్పష్టం చేశారు.

## ఆమె గురించి మాట్లాడటం వృథా అని కేసీఆర్‌కు చెప్పా..

- కేసీఆర్ బద్ధ శత్రువుల మాటలే ఆమె మాట్లాడుతున్నారు
- కేసీఆర్ లేకపోతే మేమెవరమూ లేం..
- ఎమ్మెల్సీ కవితపై జగదీశ్‌రెడ్డి విసుర్లు



**హైదరాబాద్, ఆగస్టు 3 :** తనను ఉద్దేశించి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. తన ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి ఆమెకు ఉన్న జ్ఞానానికి జోహార్లు అంటూ ఎద్దేవా చేశారు. తాను పార్టీకి సైనికుడినని, ఈ మధ్యకాలంలో కేసీఆర్‌ను 50సార్లు కలిసినా బనకచర్ల, వ్యవసాయ సంబంధిత అంశాలపైనే చర్చించామన్నారు. కవిత ప్రస్తావన వచ్చినపుడు ఆమె గురించి మాట్లాడటం వృథా అని చెప్పానని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. “నల్గొండ జిల్లాలో 25 ఏళ్లలో జరిగిన ఉద్యమాలకు, గెలుపునకు నాదే బాధ్యత అయితే.. ప్రస్తుత ఓటమికి కూడా బాధ్యుడినే. కొందరు ఏదో చేస్తామని ఊహించుకు ంటున్నారు. అది వారి భ్రమే. కేసీఆర్‌కు బద్ధశత్రువులుగా ఉన్నవాళ్లు, బీఆర్ఎసను ఖతం చేయాలని చూస్తున్నవాళ్లు అంటున్న మాటలనే ఆమె మాట్లాడుతున్నారు” అని విమర్శించారు. కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదని, వచ్చి ఉంటే స్పందించేవాడినని చెప్పారు. కేసీఆర్ లేకపోతే ఎవరూ లేమన్న దాంట్లో ఎలాంటి సందేహం లేదన్నారు. తాను చావుతప్పి కన్నులొట్టబోయినట్టు గెలిచానని.. కానీ కొంతమంది గెలవనేలేదు కదా అని పరోక్షంగా కవితను విమర్శించారు.

## సర్కారు నిర్ణయాలపై ఏం చేద్దాం..?

- ఫాంహౌస్‌లో పార్టీ నేతలతో కేసీఆర్ భేటీ
- కాళేశ్వరం కమిషన్ నివేదికపై ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందన్న దానిపై చర్చ
- కవిత వ్యవహారం, బీసీ రిజర్వేషన్ల అంశంపైనా సమాలోచనలు
- నేడు కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శనకు వెళ్లనున్న బీఆర్ఎస్ నేతలు

**గజ్వేల్, ఆగస్టు 3 :** కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేతలపై సర్కారు క్రిమినల్ చర్యలు చేపట్టే అవకాశముందన్న ప్రచారం నేపథ్యంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్‌తో ముఖ్య నేతలు భేటీ అయ్యారు. ఆదివారం ఎర్రవల్లి ఫామ్‌హౌసలో కేసీఆర్‌ను మాజీమంత్రులు తన్నీరు హరీశ్‌రావుతో పాటు పలువురు నేతలు కలిసినట్లు సమాచారం. కాళేశ్వరం కమిషన్ తన నివేదికలో పేర్కొన్న అంశాలేంటి? దాని ఆధారంగా రాష్ట్ర సర్కారు ఏవైనా చర్యలు తీసుకుంటే ఏం చేయాలన్న దానిపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. క్యాబినెట్ భేటీలో ఏం చర్చిస్తారు.. కాళేశ్వరం కమిటీ నివేదిక ఆధారంగా అధికారులు ఎటువంటి వివరాలను సిద్ధం చేశారు.. దాని ఆధారంగా క్యాబినెట్ ఎటువంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై వారు సమాలోచన చేసినట్లు సమాచారం. కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌తో పాటు బాధ్యులందరిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని పీసీ ఘోష్ కమిషన్ సూచించినట్లయితే దాన్ని ఎదుర్కొనేం దుకు ఏం చేయాలన్న దానిపై పార్టీ నేతలతో కేసీఆర్ చర్చలు జరిపినట్లు తెలిసింది. అయితే ప్రభుత్వం ఏం చేయబోతోంది.. దాన్ని ముందుగా పసిగట్టి అందుకు అనుగుణంగా న్యాయపరంగా ఎలా ఎదు-ర్కోవాలన్న దానిపై న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు శనివారం సమా వేశమైన నేపథ్యంలో.. వారి ఆలోచనలేంటి? పార్టీ పరంగా ఏ నిర్ణయాలు తీసుకుందాం.. సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో స్పీక ర్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు? అంతవరకు వేచిచూసి తదుపరి నిర్ణయం తీసుకోవాలని కేసీఆర్ పార్టీ నేతలకు సూచించినట్లు తెలిసింది.

### ఎమ్మెల్సీ కవిత వ్యవహారంపైనా చర్చ..

కేసీఆర్‌తో భేటీలో ఎమ్మెల్సీ కవిత అంశంపైనా పార్టీ నేతలు చర్చించినట్లు తెలిసింది. అలాగే బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు శ్రావణ మాసం కావడంతో ఫాంహౌసలో చండీయాగం చేసే విషయమై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. భేటీలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

## సౌర విద్యుత్ కోసం స్టోరేజ్ వ్యవస్థ

- ఇరవయ్యేళ్ల డిమాండ్‌కు తగిన ప్రణాళికలు సిద్ధం చేయండి
- జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి

**కొల్లాపూర్ :** జల విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజ్‌తో పెద్ద ఎత్తున విద్యుదుత్పత్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని.. అందుకోసం రాష్ట్రంలో 23 పాయింట్లను గుర్తించి వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల గ్రామంలోని టూరిజం అతిథి గృహంలో జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జూరాల నుంచి పులిచింతల వరకు కృష్ణానది మీద ఉన్న హైడల్ పవర్ ప్రాజెక్టుల పనితీరుపై చర్చించారు. సోలార్ ద్వారా పగలు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను.. రాత్రివేళ ఉపయోగించుకునేందుకు అవసరమైన స్టోరేజీ వ్యవస్థను రూపొందించుకోవాలని భట్టి సూచించారు. 1978లోనే ఆనాటి కాంగ్రెస్ పాలకులు, ఇంజినీర్లు లోతుగా అధ్యయనం చేసి ‘రివర్స్ పంపింగ్’ కోసం జపాన్‌కు చెందిన దిగ్గజ సంస్థలతో కలిసి నూతన సాంకేతికతను తీసుకొచ్చారని కొనియాడారు. రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని, రాబోయే ఇరవయ్యేళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ ఏడాది డిమాండ్‌కు అనుగుణంగా నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేసినందుకు అధికారులను అభినందించారు. ఆధునిక సాంకేతికతపై సిలబస్ రూపొందించి నిపుణుల పర్యవేక్షణలో సీఎండీ నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అందరికీ అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రీన్ హైడ్రోజన్, రూఫ్ సోలార్, థర్మల్, పవన, బ్యాటరీ స్టోరేజీ లాంటి ప్రత్యామ్నాయ విద్యుత్తు కోసం ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌తో సత్తా చాటిన భారత్

- దేశీయంగానే డ్రోన్లు, క్షిపణుల అభివృద్ధి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు




**హైదరాబాద్, ఆగస్టు 3:** ఆపరేషన్ సిందూర్‌తో భారతదేశ శక్తి, సామర్థ్యాలు ప్రపంచానికి మరోమారు తెలిశాయని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. స్వదేశీ క్షిపణులు, డ్రోన్లు, శక్తిమంతమైన ఎలక్ట్రానిక్ వార్ఫేర్, శత్రుదుర్భేద్యమైన రక్షణ వ్యవస్థ వినియోగంతో భారత్ తన శక్తి, స్థాయిని చాటిందన్నారు. భారత్ ఆర్థికంగా కుదేలైన దేశమని ప్రచారం చేస్తున్న వారికీ భారత్ సత్తా అతి త్వరలోనే అర్థమవుతుందని అమెరికా అధ్యక్షుడిపై ధ్వజమెత్తారు. హైదరా బాద్‌లో ఆదివారం జరిగిన ‘ఆపరేషన్ సిందూర్‌లో భాగస్వామ్యం వహించిన సైనికులకు, శాస్త్రవేత్తలకు వందనం’ అనే కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అఖిల భారత శైక్షిక్ మహాసంఘ(ఏబీఆర్ఎసఎమ్), వాయిస్ ఆఫ్ హైదరాబాదీ అకడమిషియన్స్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆపరేషన్ సిందూర్‌లో ప్రత్యక్ష, పరోక్ష పాత్ర పోషించిన రక్షణశాస్త్రవేత్తలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యుద్ధక్షేత్రంలో హీరోలు సైనికులైతే, శక్తిమంతమైన యుద్ధ వ్యవస్థలను అభివృద్ధి చేసి సైనికులకందించిన శాస్త్రవేత్తల పాత్ర కీలకమని ప్రశంసించారు. స్వాతంత్ర్య భారత్.. దేశ ప్రయోజనాలకు అనుగుణంగా వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందని, ఈ విషయంలో ఇతరుల జోక్యానికి చోటు లేదన్నారు.

### శాస్త్రవేత్తలకు సన్మానం

డీఆర్‌డీవో మిస్సైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్ ఉమ్మాలనేని రాజాబాబు, నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజరీ బోర్డు సభ్యుడు డాక్టర్ జి. సతీషరెడ్డి, తెలంగాణ, ఏపీ సబ్‌ఏరియా మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్స్ డైరెక్టర్ జగన్నాథ నాయక్, ఆకాశ్ మిస్సైల్ ప్రోగ్రాం మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రమౌళి, ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్ అజిత్ బి చౌదరి, అస్త్ర మిస్సైల్ సిస్టమ్ మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ పాట్రిక్ డిసిల్వా, అస్త్ర ప్రైమ్ ప్రాజెక్టు డైరెక్టర్ నరేంద్ర కాలె, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ పావులూరి సుబ్బారావును సన్మానించారు. కాగా, స్వదేశీ ఆయుధాలను విస్తృతంగా వాడిన తొలి యుద్ధంగా ఆపరేషన్ సిందూర్ నిలుస్తుందని డీఆర్‌డీవో మిస్సైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్ ఉమ్మాలనేని రాజాబాబు అన్నారు. సతీష్ రెడ్డి మార్గదర్శకత్వంలో యాంటీ డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేశామని సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ డైరెక్టర్ జగన్నాథ నాయక్ తెలిపారు. ఇక, ఎంతోమంది సమ్మిళిత కృషితో అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణిలో మొదటి స్వదేశీ సెన్సార్‌ను జగన్నాథ్ నాయక్ అమర్చారని, ఆ సెన్సార్ వల్లే నేడు ఆకాశ్ శక్తిమంతంగా పని చేస్తోందని ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్ అజిత్ బి చౌదరి పేర్కొన్నారు.

## ఆదివాసీల ప్రేమ అచంచలం

### కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్

**నిజామాబాద్ :** ఆదివాసీల ప్రేమ అచంచలమైందని, కాంగ్రెస్ రాజనీతిలో వారి ప్రేరణ ఇమిడి ఉందని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. కాంగ్రెస్ ‘జనహిత పాదయాత్ర’లో భాగంగా ఆదివారం నిజామాబాద్ జిల్లా అర్గుల్, నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లలో ఆమె మాట్లాడారు. దేశ ప్రజలను ఏకం చేయడం, ప్రజాసంక్షేమాన్ని కోరుకోవడం ఆదివాసీ సంస్కృతి నుంచి కాంగ్రెస్ నేర్చుకుందని చెప్పారు. దానికి భిన్నంగా ‘జల్ జంగల్ జమీన్’ కోసం పోరాడిన ఆదివాసీ వీరుల స్వప్నాలకు తూట్లు పొడిచేలా కొన్ని శక్తులు వ్యవహరిస్తున్నాయంటూ భాజపాపై ధ్వజమెత్తారు. గల్ఫ్ దేశాల్లో ప్రాణాలు కోల్పోయిన వలస బాధితుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు దిల్లీ వెళ్తున్నట్లు మీనాక్షి చెప్పారు.

### భాజపా ఎమ్మెల్యేలను బీసీలు క్షమించరు: మహేశ్‌కుమార్‌గౌడ్

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. “బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తుంటే భాజపా ఎమ్మెల్యేలు నోరుమెదపడం లేదు. రిజర్వేషన్లను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వత్తాసు పలుకుతున్నారు. వారిని బీసీలు క్షమించరు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కిషన్‌రెడ్డి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నా ఎంపీలు సంజయ్, ఈటల రాజేందర్, అర్వింద్‌లు ఎందుకు ఖండించడం లేదు? భారత రాష్ట్ర సమితి నాలుగు ముక్కలైంది. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. హరీశ్‌రావు అదను కోసం ఎదురుచూస్తున్నారు. దోచుకున్న సంపద పంపకాల తేడాల్లో భాగంగానే కేటీఆర్, కవితకు మధ్య గొడవలు జరుగుతున్నాయి’ అని ఆరోపించారు. కార్యక్రమాల్లో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్సీ వెంకట్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, లక్ష్మీకాంతరావు, వెడ్మ బొజ్జు, మక్కాన్‌సింగ్, నేతలు ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాలాచారి, జీవన్‌రెడ్డి, రేఖానాయక్, నారాయణరావు, విఠల్‌రెడ్డి, నిజామాబాద్, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు. ఖానాపూర్ కార్యక్రమానికి మంత్రి వివేక్, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు ప్రేంసాగర్‌రావు, వినోద్ హాజరు కాలేదు.

# ఆమే అన్ని నేరాలకు మూలం'.. హసీనాపై విచారణ షురూ



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మానవాళికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నేడు ఆయా కేసుల్లో హసీనాపై విచారణను ప్రారంభించింది. తాత్కాలిక ప్రభుత్వం నియమించిన చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం.. హసీనాను అన్ని నేరాలకు మూలకేంద్రంగా పేర్కొన్నారు. ఆమెకు గరిష్ఠ శిక్ష విధించాలన్నారు. ఈ కేసుల్లో మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్, మాజీ ఐజీపీ చౌదరీ అబ్దుల్లా అల్ మామున్‌లు సహా నిందితులుగా ఉన్నారు. విద్యార్థుల ఆధ్వర్యంలో గత ఏడాది జులై–ఆగస్టులో జరిగిన ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు హసీనా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. భారీ సంఖ్యలో ఉద్యమకారులను చంపించడం, హింసించడం వంటి నేరాభియోగాలను ఆమెపై మోపారు. వీటిపై ఐసీటీ నేడు విచారణను ప్రారంభించింది. హసీనా, అసదుజ్జమాన్‌లు ఇప్పటికే దేశాన్ని వీడారు. మామున్ ఒక్కరే కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో సాక్షిగా మారేందుకు ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. నిరసనల సమయంలో గాయపడిన వ్యక్తులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి ఆధారాలు సమర్పిస్తామని ప్రాసిక్యూషన్ తెలిపింది. గత ఏడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పదవి కోల్పోయి, దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు హోంశాఖ మాజీ మంత్రి కూడా బంగ్లాదేశ్‌ను వీడారు. ఈ క్రమంలోనే స్థానికంగా నోబెల్ పురస్కార గ్రహీత యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. ఆయా కేసుల్లో విచారణ కోసం హసీనాను అప్పగించాలని భారత్‌ను అభ్యర్థిస్తోంది. ఇదిలా ఉండగా.. జులై 10న హసీనా, కమల్, మామున్‌లపై ఐసీటీ అభియోగాలు మోపింది. అంతకుముందు కోర్టు ధిక్కరణ కేసులో ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది.



# ఆ ఊరి పేరు 'ఫ్రెండ్‌షిప్'

**న్యూయార్క్:** న్యూయార్క్‌లో 'ఫ్రెండ్‌షిప్' పేరుతో పెద్ద పట్టణమే ఉంది. కొన్ని వందల ఏళ్ల క్రితం అక్కడ రెండు తెగల మధ్య తరచూ గొడవలు జరిగేవట. అందుకే ఈ ప్రాంతాన్ని 'ఫైటింగ్ కార్నర్స్'గా పిలిచేవారట. ఆ తర్వాత అక్కడుండే జనాలు కలిసిమెలిసి ఉండాలంటూ వాళ్లలో సయోధ్యను పెంచడానికి రకరకాల కార్యక్రమాలు మొదలయ్యాయి. అందులో భాగంగానే 1815లో అధికారికంగా ఆ ఊరికి ఫ్రెండ్‌షిప్ అనే పేరు పెట్టారు. అమెరికాలోని ఆడమ్స్ కౌంటీలో కూడా 'ఫ్రెండ్‌షిప్' పేరుతో మరో ఊరు ఉంది. 1857లో న్యూయార్క్‌లోని 'ఫ్రెండ్‌షిప్' పట్టణం నుంచి వలస వెళ్లినవాళ్లందరూ కలిసి ఓ దగ్గరకు చేరి గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారట. కలిసికట్టుగా ఉండాలన్న ఆలోచనతో తమ సొంత ఊరి పేరునే కొత్త గ్రామానికి పెట్టుకున్నారు.

# రష్యాలో మళ్లీ భూకంపం..

**మాస్కో:** రష్యాలోని కురిల్ దీవులలో ఆదివారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.0 తీవ్రత నమోదైంది. జపాన్ వాతావరణ శాఖ, యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ ఈ విషయాన్ని వెల్లడించాయి. రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ పలు ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలియలేదు. భూకంపం ధాటికి పలు నగరాల్లోని భవనాలు ఊగిపోయాయని రష్యా మీడియా తెలిపింది. ప్రజలు భయభ్రాంతులకు గురై ఇళ్ల నుంచి పరుగులు తీసినట్లు పేర్కొంది. ఇటీవల రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత నమోదైంది. ఈ భారీ భూప్రకంపనల ధాటికి రష్యా, జపాన్‌తో పాటు ఉత్తర పసిఫిక్‌లోని పలు తీర ప్రాంతాలను సునామీ తాకింది. పసిఫిక్ ప్రాంతంలో 2011 తర్వాత ఇదే అత్యంత భారీ భూకంపమని నిపుణులు పేర్కొన్నారు. దాని ప్రభావంతోనే తాజాగా భూకంపం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# బద్దలైన అగ్నిపర్వతం..



**రష్యా :** రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పంలోని క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం శనివారం అర్ధరాత్రి బద్దలైనట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల సంభవించిన భారీ భూకంపం వల్ల దాదాపు 600 ఏళ్ల తర్వాత మొదటిసారి ఈ అగ్నిపర్వతం బద్దలైనట్లు రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో 6 వేల మీటర్ల ఎత్తుకు బూడిద ఎగసిపడినట్లు వెల్లడించింది. మరో ఘటనలో కమ్చట్కా ద్వీపకల్పంలోని అత్యంత చురుకైన అగ్నిపర్వతం క్ల్యూచెస్కీ బద్దలైంది.

## ఆ 'ఎస్ఐఆర్'ను తమిళనాడుతో

# ముడిపెట్టడమా?

### ఎన్నికల సంఘం




**బిహార్ :** బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా.. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను తమిళనాడుతో ముడిపెట్టడం అసంబద్ధమని పేర్కొంది. తమిళనాడులో ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ ఇంకా నిర్వహించలేదని గుర్తుచేసింది. 'ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారుతోంది. బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా.. తమిళనాడులో మాత్రం 6.5లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఇది ఆందోళనకరమైన చర్య. చట్టవిరుద్ధమైనది' అని పి.చిదంబరం ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రం నుంచి శాశ్వతంగా వలస వెళ్లారనే కారణంతో బిహార్‌లోని లక్షలాది మంది ఓటర్లను తొలగించాలని ఎన్నికల సంఘం ఎలా నిర్ధరణకు వచ్చిందని ప్రశ్నించారు. ఈసీ తన అధికారాలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. చిదంబరం వ్యాఖ్యలను నిరాధారమైనవిగా, తప్పుదోవ పట్టించేవిగా పేర్కొంటూ ఎన్నికల సంఘం ఖండించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం– 1950లోని సెక్షన్ 19(బీ) ప్రకారం.. ఒక నియోజకవర్గంలో నివసిస్తున్న వ్యక్తి స్థానిక ఓటర్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి దిల్లీలో నివసిస్తున్నట్లయితే.. దిల్లీలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. అలాగే బిహార్‌కు చెందిన వ్యక్తి చెన్నైలో ఉంటే.. అదే విధానం వర్తిస్తుందని తెలిపింది. ఈ నేపథ్యంలో.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి నేతలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం తగదని ఈసీ పేర్కొంది. ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. అదేవిధంగా.. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్ల నమోదు గురించి తప్పుడు ప్రచారం జరుగుతోందని చెప్పింది. ఆ రాష్ట్రంలో ఇంకా ఓటర్ల జాబితా సవరణ చేపట్టలేదని.. కాబట్టి బిహార్‌లోని ఎస్ఆఐర్ ప్రక్రియతో ముడిపెట్టడం అసంబద్ధమని స్పష్టం చేసింది.

## ఒక్క నెలలోనే 6,000 పైగా

# డ్రోన్లతో దాడులు..

### విరుచుకుపడుతున్న రష్యా



**రష్యా :** ఇటీవల కాలంలో ఉక్రెయిన్‌పై రష్యా తన దాడులను తీవ్రతరం చేసింది. గత నెలలో ఏకంగా ఆరు వేలకు పైగా డ్రోన్లు ప్రయోగించినట్లు తెలుస్తోంది. 2022లో యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి ఒక నెలలో ఈ స్థాయిలో డ్రోన్ దాడులు చేపట్టడం ఇదే మొదటిసారని ఓ అంతర్జాతీయ వార్తాసంస్థ పేర్కొంది. ఈ దాడుల్లో ఉక్రెయిన్‌లో పదుల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయయని, పెద్దఎత్తున ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపింది. ఉక్రెయిన్ వైమానిక దళం వివరాల ప్రకారం.. మాస్కో సేనలు గత నెలలో 6,297 దీర్ఘశ్రేణి డ్రోన్లను ప్రయోగించాయి. జూన్‌తో పోలిస్తే దాదాపు 16 శాతం ఎక్కువ. గత ఏడాది జులైతో పోలిస్తే ఈ ఏడాది జులైలో 14 రెట్లు ఎక్కువ డ్రోన్లు ప్రయోగించినట్లు మరో నివేదిక తెలిపింది. ఇవి కేవలం అంచనాలు మాత్రమేనని, వాస్తవ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని ఉక్రెయిన్ వైమానిక దళ ప్రతినిధి యూరి ఇహ్నాత్ తెలిపారు. గత నెల 9న ఒక్క రాత్రిలోనే రష్యన్ బలగాలు రికార్డు స్థాయిలో 728 డ్రోన్లు, 13 క్షిపణులతో విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో ఉక్రెయిన్‌లోని సుమీ, దొనెట్స్క్, ఖేర్సన్ రీజియన్‌లలో ఎనిమిది మంది మరణించారు. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు ఇవ్వాల్సి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన మరుసటి రోజే ఈ భీకర దాడులు చేపట్టింది. జులై 31న కీవ్‌పై జరిపిన దాడిలో ఐదుగురు చిన్నారులు సహా 31 మంది మృతి చెందారు. మరో 159 మంది గాయపడ్డారు.

# పీఎల్ఐ తరహా పథకం కావాలి

- ఆర్థికంగా సహాయం చేయండి
- ట్రంప్ సుంకాల నేపథ్యంలో ప్రభుత్వాన్ని కోరుతున్న ఎగుమతిదారులు



**దిల్లీ:** అమెరికా విధించిన 25% సుంకాలను భరించేందుకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం తరహాలో ప్రత్యేక పథకాన్ని తీసుకురావాలని వివిధ రంగాలకు చెందిన దేశీయ ఎగుమతిదారులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముంబయిలో జరిగిన ఒక సమావేశంలో కేంద్ర, వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు తమ అభ్యర్థనను తెలియజేసినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. టారిఫ్ భారాన్ని భరించేందుకు ఆర్థిక సాయం, రుణాలు అందించాలని కోరినట్లు పేర్కొన్నాయి. అధిక సుంకాల కారణంగా అమెరికా మార్కెట్లో తమకు ఎదురయ్యే సమస్యలను మంత్రితో పంచుకున్నట్లు వివరించాయి. తమ సమస్యలను లిఖిత పూర్వకంగా పంపాలని మంత్రి సూచించారని తెలిపాయి. దేశంలోని ఎగుమతిదారులకు బ్యాంకులు అందించే రుణాలపై వడ్డీ రేట్లు 8–12 శాతంగా ఉన్నాయి. పోటీ దేశాల్లో ఈ ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. దుస్తులు, రొయ్యల రంగాల పరిస్థితి బాగాలేదు. అమెరికా దిగుమతిదారులు తమ ఆర్డర్లను రద్దు చేస్తున్నారు. రానున్న నెలల్లో ఎగుమతులపై ఇది ప్రభావం చూపిస్తుందని, దీనివల్ల ఉద్యోగ నష్టం లాంటివి ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అధిక భారం పడే రంగాల్లో జౌళి రంగం (10.3 బిలియన్ డాలర్లు), రత్నాలు–ఆభరణాలు (12 బి.డాలర్లు), రొయ్యలు (2.24 బి.డాలర్లు), తోలు, పాదరక్షలు (1.18 బి.డాలర్లు), రసాయనాల పరిశ్రమ (2.34 బి.డాలర్లు), ఎలక్ట్రికల్–మెకానికల్ యంత్రాల (9 బి.డాలర్లు) రంగాలున్నాయి.

# పీకల్లోతు వరద నీరు..



**లఖ్‌నవూ:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉత్తరప్రదేశ్ లోని అనేక నగరాలను వరదలు ముంచెత్తుతున్నాయి. వరద ప్రభావం వల్ల వారణాసి, ప్రయాగ్‌రాజ్‌లలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల జీవన పరిస్థితులు దుర్భరంగా మారాయి. ఆ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. చోటా బఘాడా ప్రాంతానికి చెందిన దంపతులు అనారోగ్యంతో ఉన్న తమ నవజాత శిశువును ఆస్పత్రికి తరలించడానికి అవస్థలు పడుతున్న వీడియో వైరల్‌గా మారింది. పీకల్లోతు నిలిచి ఉన్న వరద నీటిలో దంపతులు తమ చిన్నారిని తీసుకువెళ్లారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో ప్రతిపక్షాలు యూపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించడానికి యోగి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని ఆప్ నేత సంజయ్ సింగ్ మండిపడ్డారు. ప్రభుత్వం సాయం చేయకపోవడంతో ఆ తల్లిదండ్రులు తమ చిన్నారిని కాపాడుకోవడానికి ఇక్కట్లు ఎదుర్కొన్నారని అన్నారు. ఆడంబరాల కోసం ఏటా రూ.వేల కోట్లు ఖర్చు చేసే యోగి ప్రభుత్వం.. ప్రజల గురించి మాత్రం రూపాయి కూడా ఖర్చు చేయట్లేదని విమర్శలు గుప్పించారు. ధనవంతులు ఉండే ప్రాంతాల్లో మాత్రమే రక్షణ చర్యలు తీసుకుంటారా? పేద ప్రజల దుస్థితి ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం యూపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రయాగ్‌రాజ్ అభివృద్ధికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినట్లు యోగి ప్రభుత్వం చెప్పిందని.. ఆ అభివృద్ధి ఇదేనా అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అవినీతి అనే లోతైన గుంతల్లో చేరిన ఈ వరద నీరే భాజపా ప్రభుత్వం చేస్తున్న మోసాలు, చీకటి వ్యవహారాలను బయటపెడుతోందని అన్నారు. వరదల కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, జలౌన్, ఔరైయా, హమీర్‌పుర్, ఆగ్రా, మీర్జాపుర్, వారణాసి, కాన్పూర్, బల్లియా, బండా, ఇటావా, ఫతేపుర్, చిత్రకూట్‌లతో సహా 14 జిల్లాలు ప్రభావితం అయినట్లు అధికారులు పేర్కొన్నారు.



# ఆ ఓటరు కార్డు అప్పగించండి..

### తేజస్వీకి ఈసీ నోటీసులు

**బిహార్ :** బిహార్ ఓటర్ల జాబితా ముసాయిదాలో తన పేరు లేదని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించడంపై కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి స్పందించింది. ఆ కార్డు అధికారికంగా జారీ చేసింది కాదని, సమగ్ర దర్యాప్తు జరిపేందుకు దానిని అప్పగించాలంటూ నోటీసులు జారీ చేసింది. "ఆగస్టు 2న పట్నాలో విలేకరుల సమావేశంలో తేజస్వీ చూపించిన గుర్తింపు కార్డు అధికారికంగా జారీ చేసింది కాదు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసేందుకు ఆ కార్డును అప్పగించాలని కోరుతున్నాం" అని పేర్కొంటూ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌కు ఎన్నికల సంఘం అధికారులు లేఖ రాశారు. మరోవైపు తన ఓటరు కార్డు నంబరు మార్చారని తేజస్వీ చేసిన వాదనను జిల్లా కలెక్టర్ తిరస్కరించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న ఓటరు గుర్తింపు నంబరు కూడా ఇదేనన్నారు. మరోవైపు ఓటరు గుర్తింపు కార్డుపై తేజస్వీ యాదవ్ చేసిన ఆరోపణలపై బిహార్‌లోని ఎన్డీయే కూటమి పక్షాలు మండిపడ్డాయి. రెండు కార్డులు కలిగి ఉండటం చట్టవిరుద్ధమని, అందుకు ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి. రాహుల్ గాంధీ చెప్పిన "ఆటమ్ బాంబు' ఇదేనా అని విమర్శలు గుప్పించాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష కూటమి ఓటమి చవిచూస్తుందని, ఇటీవల ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్‌ను అందుకు సాకుగా చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ఇటీవల ఈసీ ప్రకటించిన ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాలో తన గుర్తింపు కార్డు నంబరు కనిపించలేదని, రాష్ట్రంలో 65 లక్షల ఓటర్ల పేర్లను తొలగించారని తేజస్వీ యాదవ్ ఆరోపించారు. దీనిపై స్పందించిన ఈసీ.. అవి నిరాధారమని స్పష్టం చేసింది. ముసాయిదా జాబితాలో 416 క్రమ సంఖ్య వద్ద తేజస్వి పేరు ఉందని, ఆయన చెప్పిన కార్డు ఫోర్జరీ చేశారా? అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది. ఈ క్రమంలోనే ఆ కార్డును తమకు అప్పగించాలంటూ లేఖ రాసింది.



# డబ్బుల కోసం అడ్డదారులు..

### కశ్మీర్‌లో నయా సోషల్ మీడియా దందా

**న్యూఢిల్లీ :** సామాజిక మాధ్యమాల్లో కొంతమంది కశ్మీరీ యువత అడ్డదారులు తొక్కుతున్నట్లు తెలుస్తోంది. ఫాలోవర్లను పెంచుకునేందుకు, ప్రకటనదారుల నుంచి ఆదాయాన్ని పొందేందుకు.. వేర్పాటువాదులను, ఉగ్రవాదులను పొగడటం వంటి రెచ్చగొట్టే కంటెంట్‌ను పోస్ట్ చేస్తున్నట్లు సమాచారం. భావజాలంతో పని లేకుండా.. కేవలం ఫాలోవర్లు, ఆదాయం కోసమే ఇలా వ్యవహరిస్తున్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. ఇటువంటి ఖాతాలను నడిపిస్తున్న కొంతమంది యువకులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. ఈ వ్యవహారం వెలుగుచూసింది. కరడుగట్టిన ఉగ్రవాది హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ వానీ.. 2016లో భద్రతాబలగాల చేతిలో హతమైన విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో ఫాలోవర్ల కోసం అటువంటి వ్యక్తుల ఫొటోలను వినియోగించడం వంటి వ్యూహాలు అమలు చేస్తున్నట్లు సంబంధిత యువకులు విచారణలో అంగీకరించినట్లు సమాచారం. ఇలా దేశ, విదేశాల నుంచి అనేక మంది ఫాలోవర్లను సంపాదించిన అనంతరం.. ఆ వ్యక్తుల ఫొటోలను తొలగించి పర్వతాలు, చినార్ చెట్ల వంటి ఇతర ఫొటోలను ఉంచుతున్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. కశ్మీర్ లోయలో ఈ కొత్త ధోరణి కలవరపెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత ప్రయోజనాల కోసం సున్నితమైన అంశాలను వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు తమ నిఘాను ముమ్మరం చేశారు. అదేవిధంగా.. పిల్లల భవిష్యత్తుపై దీని దుష్ప్రభావం గురించి కుటుంబాలకు అర్థమయ్యేలా వివరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి వ్యవహారంలో ఇటీవల ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. తల్లిదండ్రుల ముందే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి విడిచిపెట్టినట్లు అధికారులు తెలిపారు. కశ్మీర్ లోయలో రెచ్చగొట్టే ఫొటోలు ఉపయోగించే ఇన్‌ఫ్లుయెన్సర్ల సంఖ్య పెరుగుదల వెనుక ఆర్థికపరమైన కారణాలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రకటనదారుల నుంచి ఆదాయాన్ని పొందేందుకు.. ఈ విధమైన అక్రమ మార్గాలను అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. ఇటువంటి ఇన్‌ఫ్లుయెన్సర్లలో చాలామంది సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో బ్రాండ్ పార్ట్‌నర్‌షిప్‌లపై ఆధారపడ్డారని తెలిపారు. సంబంధిత ఉత్పత్తుల గురించి ప్రచారం చేయడం, కంటెంట్‌లో వాటి ప్రస్తావన తీసుకురావడం వంటివి చేస్తున్నారని చెప్పారు.



# కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి బాంబు బెదిరింపు

**న్యూఢిల్లీ :** కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నివాసానికి బాంబు బెదిరింపు రావడం కలకలం సృష్టించింది. నాగ్‌పుర్‌లోని గడ్కరీ నివాసంలో బాంబు పెట్టినట్లు ఓ వ్యక్తి కాల్ చేసి చెప్పడంతో అప్రమత్తమైన పోలీసులు బాంబ్‌స్క్వాడ్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఎటువంటి పేలుడు పదార్థాలు దొరకకపోవడంతో అది నకిలీ బెదిరింపు అని తేల్చారు. అనంతరం ఫోన్ నంబర్ ఆధారంగా గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నకిలీ బెదిరింపు కాల్ చేసిన వ్యక్తిని నాగ్‌పుర్ తులసి బాగ్ రోడ్‌లోని మద్యం దుకాణంలో పనిచేసే ఉమేష్ విష్ణు రౌత్‌గా గుర్తించామన్నారు. విచారణ అనంతరం క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. బెదిరింపు కాల్ చేయడానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.










## దేశభక్తి జన్ బెస్ట్ అవార్డు అందుకున్న సీనియర్ జర్నలిస్ట్ మచ్చ రమేష్

**ఆత్మకూరు (ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ యం మండలం లోని సర్వేపల్లి గ్రామానికి చెందిన మచ్చ రమేష్ బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డును అందుకున్నారు. 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం రవీంద్ర భారతిలో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయనని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా వారు సంతోషం వ్యక్తం చేశారు ఈ సన్మాన కార్యక్రమంలో తేనేటి కృష్ణ ప్రసాద్,బాపట్ల ఎంపీ సెంట్రల్ స్పీకర్ తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రతిపక్ష నాయకులు వి.మధుసూదన్ చారి,ఎమ్మెల్సీ మాజీ ఎంపీ వి హనుమంతరావు,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రెస్ అకాడమీ చైర్మన్ సత్యనారాయణ, సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ మినగా గోపి పరమేశ్వర్లు న్యాయవాదులు రాజకీయ నాయకులు పలు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవ నూతన కమిటీ అధ్యక్షులుగా మైసోల్ల రాజు

**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ పట్టణ కేంద్రంలోని ఆదివారం రాంనగర్ కాలనీలో త్వరలో రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా మైసోల్ల రాజు ఉపాధ్యక్షులుగా మైసొల్ల మత్స్యగిరి, ప్రశాంత్, నరేష్, కలకూరి మధు ప్రధాన కార్యదర్శులుగా కలుకూరి రాజు కోమిరెల్లి సురేష్ మైసోల్ల శ్రీకాంత్, గణేష్ కోశాధికారిగా మైసోల్ల శ్రీకాంత్, వేణు ప్రచార కార్యదర్శిగా నాగేల్లి భాను,నానచర్ల గణేష్,బత్తిని సాయి చరణ్, సాంస్కృతిక కార్య దర్శిగా మైసోల్ల సాయి, వంశీ, కార్యవర్గ సభ్యులుగా కాంబోజు రాజు, సురేందర్ రెడ్డి, శివ, నరేష్, పాండు, నవీన్, గణేష్,చింటూ, మహేందర్,సన్నీ, రమేష్,అర్జున్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ త్వరలో రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను రామ్ నగర్ కాలనీలో ప్రశాంతంగా నిర్వహిస్తామని అంతేకాకుండా మండల కేంద్రంలోని ప్రజలు రాంనగర్ గణేశుని వద్ద నిర్వహించే పూజల్లో పాల్గొని ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



## పబ్లిక్ క్లబ్ అభివృద్ధికి కృషి

- త్వరలో స్విమ్మింగ్ ఫుల్ నిర్మాణం
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్,పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట పట్టణంలోని పబ్లిక్ క్లబ్ లో షాపింగ్ కాంప్లెక్ నిర్మాణ భూమి పూజ నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్,పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నేను కార్యదర్శిగా ఉన్నప్పుడు 51 దుకణాలతో షాపింగ్ కాంప్లెక్స్ ను నిర్మించి పబ్లిక్ క్లబ్ కు నెలకు 3లక్షల రూపాయల వరకు ఆదాయ మార్గం వచ్చే విధంగా చేశామన్నారు. గత సంవత్సరం ఇదే తారీఖున కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశామని గత పాలకవర్గం చేసిన అవినీతిని తప్పిదాలను సరిచేయడానికి 6 నెలల సమయం పట్టిందని త్వరలో 365 రోజులు సూర్యాపేట పట్టణ ప్రజలకు, పబ్లిక్ క్లబ్ సభ్యులకు అందుబాటులో ఉండేలా స్విమ్మింగ్ ఫుల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజద్ అలి, పబ్లిక్ క్లబ్ ఉపాధ్యక్షుడు మర్రు హనుమంతరావు, కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు శెనగాని రాంబాబు, బత్తిని వెంకటేశ్వర్లు, ఫరిదోద్దీన్ అహ్మద్, పోలేబొయిన నర్సయ్య యాదవ్, గవ్వ కేశవ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, నిమ్మల వెంకటేశ్వర్లు, చల్లా సత్యనారాయణ, పబ్లిక్ సీనియర్ సభ్యులు కుమ్మరికుంట్ల లింగయ్య, వెలుగు కరుణాకర్, సంపత్, దుర్గారావు పాల్గొన్నారు.



## టియు జెఏసి జిల్లా అడక్ కమిటీ ఎన్నిక

**భువనగిరి రాజముద్ర న్యూస్:**తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ భువనగిరి జిల్లా అడక్ కమిటీని ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది జిల్లా కమిటీ కన్వీనర్ గా సంగిశెట్టి క్రిస్టఫర్ కో కన్వీనర్ గా ఎర్ర జాన్సన్ కో కన్వీనర్ గా బాకారం లావణ్య కో కన్వీనర్ గా మహమ్మద్ జాంగిర్ జిల్లా కమిటీ సభ్యులుగా సింగారపు ఉప్పలయ్య గుండాల మండలం పాకాల అనిల్ రాజపేట మండలం దార్ల దుర్గయ్య తుర్కపల్లి మండలం ఎం కృష్ణ యాదగిరిగుట్ట అంజలి రాజపేట శ్రావణ్ ఆలేరు, ఎలిమినేటి బుచ్చయ్య ఆత్మకూరు,శ్రీను, అడేపు మూటకొండూరు కొండాపురం శ్రీను భువనగిరి కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ఘనంగా దొంతిరి హరిశంకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్ :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వారి నివాసంలో జరిగిన వేడుకలలో మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కలిసి పాల్గొని వారిని శాలువాతో సత్కరించి కుటుంబసభ్యులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి సొంత నిధులతో నిర్మించిన సాయి నగర్ హిల్స్ కాలనీ, విహారిక కాలనీ, ఇంద్రప్రస్థ కాలనీ ల కమాన్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, జావీద్ ఖాన్, ప్రభు, పింగళి జోగిరెడ్డి, బుల్లెట్ శంకర్, కిరణ్ నాయక్ డివిజన్ ప్రజలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.







# బోడుప్పల్‌లో బోనాలు

- బోడుప్పల్ లో ఘనంగా బోనాల జాతర
- శ్రీ బంగారు మైసమ్మ దర్శించుకున్న పలువురు నాయకులు
- పలహార బండ్ల ఊరేగింపులు, తొట్టెల ఊరేగింపులతో కోలాహలంగా బోడుప్పల్
- అమ్మవార్లకు బోనం సమర్పించి ముక్కులు తీర్చుకున్న భక్తులు



**బోడుప్పల్, రాజముద్ర న్యూస్ :** డప్పుల దరువులు.. పోతరాజుల విన్యాసాలు.. శిగసత్తుల పూనకాలు.. పలహార బండ్ల ఊరేగింపులతో బోడుప్పల్ నగరం కోలాహలంగా మారింది. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయా లను ప్రతిబింబించేలా బోనాల పండుగ జాతర బోడుప్పల్ నగర పరిధిలో ఆదివారం ఘనంగా జరిగింది. బోనాల పండుగ జాతరతో నగరంలోని శ్రీ బంగారు మైసమ్మ, శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ పోచమ్మ తల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో తయారు చేసిన బోనాన్ని మహిళలు తలపై ఎత్తుకొని ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మవార్లకు సాక పోసి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా నగర పరిధిలోని అమ్మవారి ఆలయాల వద్ద నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని పలు కాలనీలగుండా సాగిన బోనాల జాతర ఊరేగింపు శ్రీ బంగారు మైసమ్మ ఆలయంతో నగరం లోని శ్రీ పోచమ్మ తల్లి, నల్ల పోచమ్మ ఆలయాల వరకు కొనసాగింది.



### అమ్మవార్లను దర్శించుకున్న ప్రజా ప్రతినిధులు

బోడుప్పల్ నగరంలో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లతో పాటుగా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శ్రీ బంగారు మైసమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, బోడుప్పల్ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్, సామల బుచ్చిరెడ్డి, జక్క వెంకట్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి, మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, నా యకులు పులకండ్ల జంగారెడ్డి, దానగాళ్ల యాదగిరి, మంద సంజీవ రెడ్డి, ఫకీర్ హరినాద్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ కాలనీల ప్రతి నిధులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# స్థానిక సంస్థల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

- కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
- 11ఏళ్లలో చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుకోసం కృషి చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు






**మొయినాబాద్ రాజముద్ర న్యూస్:** తెలంగాణలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేపడుతున్నా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని గత 11 ఏళ్లలో చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పేర్కొన్నారు. గ్రామ సౌభాగ్యం బీజేపీతోనే సాధ్యం అనే పేరుతో ఇంటికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించే కార్యక్రమంలో భాగంగా ఆయన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం శ్రీరామ్ నగర్ గ్రామంలో ఆదివారం పర్యటించారు. ముందుగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ మోడీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు.అదే విధంగా ఆరు గ్యారంటీల హామీ తో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని అందరూ సిద్ధంగా ఉండాలని చెప్పారు. జిల్లా పరిషత్, కార్పొరేషన్, చైర్మన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మళ్లీ శ్రీరామ్ నగర్ గ్రామానికి రావడం జరుగుతుందని... అప్పుడు బీజేపీ బిడ్డలే ప్రజాప్రతినిధులుగా కనిపించాలని ఈ సందర్భంగా చెప్పారు. గత 11 ఏళ్లలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడిందని వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. ప్రధానిగా మోడీ ఉండడం వల్లనే దేశం ఎంతో ప్రశాంతంగా అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గడపగడపకు బీజేపీని తీసుకువెళ్లానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే రత్నం, జిల్లా ఎన్నికల కన్వీనర్ అందె శ్రీరాములు, అంజన్ కుమార్ గౌడ్, కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్ వెల్లి ప్రభాకర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, ఓబీసీ జిల్లా కన్వీనర్ ఎల్గని వెంకటేష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు, శ్రీకాంత్, బూత్ అధ్యక్షులు నేరెట్ల శివ గౌడ్, పటేల్ శ్రీనివాస్ రెడ్డి, మెన్ రెడ్డి, మహేందర్ చారి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## జాతీయ మాలమహానాడు సంఘం దమ్మాయిగూడ మున్సిపాలిటీ అధ్యక్షులుగా అరిగే నాగరాజు నియామకం

**కీసర, రాజముద్ర న్యూస్:** జాతీయ మాల మహానాడు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు జాతీయ మాల మహానాడు సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ గుజ్జుక పరశురాం ఆర్ జి కే కాలనీకి చెందిన అరిగే నాగరాజు ను దమ్మాయిగూడ మున్సిపాలిటీ జాతీయ మాల మహానాడు సంఘం అధ్యక్షులుగా ప్రకటిస్తూ నియామక పత్రాన్ని చైతన్య భూమి ప్రాంగణంలో మాల సంక్షేమ సంఘం కమిటీ సభ్యుల సమక్షంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా నియమించబడ్డ అధ్యక్షులు అరిగే నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధనకై, రాజ్యాంగ పరిరక్షణకై మాల సంఘం ఉన్నతిని కాపాడుతూ నా జాతికి సేవ చేస్తానని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ జి కే కాలనీ మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు యాట రాజు, గౌరవ అధ్యక్షులు అబ్బులు, ఆర్ జి కె కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ఆర్ జి కె కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ, మాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సానాది సాయిబాబ, కాలనీ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాధాకృష్ణ , మాల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు దుబాయ్ రాజు, కోశాధికారి చేన్నయ్య , ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, మాల సంఘం కమిటీ సభ్యులు కె.వి రావు, మనోజ్ పాల్గొన్నారు.



## కీసరలో అంబేద్కర్ 183వ జ్ఞాన మాల కార్యక్రమం

**కీసర, రాజముద్ర న్యూస్:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ కీసరలో 183వ జ్ఞానమాల కార్యక్రమాన్ని కీసర మండలం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నాడు అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ఆధ్యర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నూనె ముంతల హరిబాబు గౌడ్ యాద్గార్పల్లి గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హాజరయ్యారు. హరిబాబు గౌడ్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 183వ జ్ఞానమాల కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉంది అన్నారు. అంబేద్కర్ ఆశయాలని అందరు ముందుకు తీసుకువెళ్లాలని ప్రపంచంలోనే గొప్ప మేధా శక్తిమంతుడు అంబేద్కర్ అని కొనియాడారు.. విద్యార్థులనీ, యువతనీ తప్పు దారి పట్టకుండా చూసుకుంటామని అలాగే క్రీడలలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు బలిదె రమేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి నాగేష్ గుప్తా, కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి, యాద్గారపల్లి మాజీ సర్పంచ్ పుట్ట రాజు ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ తర్రె మల్లేష్ యాదవ్, మాజీ వార్డ్ మెంబర్ బోయిని శ్రీరాములు ముదిరాజ్, ఏలూరి గణేశ్ ముదిరాజ్ , కీసర గుట్ట ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ రాగుల రమేష్, కీసర గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎర్ర సాయిలు, ప్రధాన కార్యదర్శి తుడుం బాలరాజ్, రాజలింగం ముదిరాజ్, తుడుం ఆగమయ్య, గంగాధారి బ్రహ్మ చారి, నీరుడి కబీర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సునీల్

### పరకాల నియోజకవర్గం ఇంచార్జ్ ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్

**పరకాల రాజముద్ర న్యూస్:** పరకాల మండలంలోని వేల్లంపల్లి గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం పరకాల నియోజకవర్గ ఇంచార్జి ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మల్లేశం గౌడ్ మాట్లాడుతూ.. రాబోయే రోజులలో బీసీలకు రాజ్యాధికారం రావాలంటే పోరాటం తప్పదని మనమంతా ఏకతాటి పై ఉండి ఏకం కావలసిన అవసరం ఉందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మన బీసీల సత్తా చాటాలని మల్లేశం గౌడ్అన్నారు. పరకాల నియోజక వర్గ పరిధిలోని పలు గ్రామాలలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగు తుందని ఇందులో భాగంగా పరకాల మండలం వెల్లంపల్లి గ్రామంలో బీసీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా మారబోయిన సునీల్ ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా బండి చెంధు ప్రధాన కార్యదర్శిగా నూటెంకి కార్యదర్శి బొచ్చు శివప్రసాద్ నూటెంకి దినేష్ కోశాధికారి మంద రవీందర్ లను ఏకగ్రీవంగా ఎన్ని కూడా జరిగింది ఈ కార్యక్రమంలో పరకాల మండల బిసి నాయకులు కోడెల సతీష్ ఎదునూరి లింగన్న చిర్ర హరీష్ సాయికుమార్ రాస రాజేష్ బీసీ సంఘం ముఖ్య నాయకులు పలువురు పాల్గొన్నారు.



## ప్రతి వ్యక్తికి స్నేహితుని తోడ్పాటు ఎంతో అవసరం

### భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**వలిగొండ, రాజముద్ర న్యూస్:** ప్రతి ఒక్క వ్యక్తికి స్నేహితుని తోడ్పాటు ఎంతో అవసరమని భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన నివాసంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరికి స్నేహితుడు ఎంతో అవసరమని,కుటుంబ సభ్యులు అందించని తోడ్పాటు స్నేహితుల అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి,నాయకులు బత్తిని సహదేవ్,నూతి రమేష్, ఊలిపే మల్లేశం,కొండూరు భాస్కర్,కాసుల వెంకటేశం, కొండూరు ఆంజనేయులు, కొండూరు సాయి,చిలుకూరి సత్తిరెడ్డి,కొండూరు భాస్కర్, బాలు పాల్గొన్నారు.

## కలిసికట్టుగా ఉంటేనే కాలనీల అభివృద్ధి

- పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి
- ఈస్ట్ శ్రీ సాయి నగర్ కాలనీ నూతన కమిటీ సభ్యులను సన్మానించిన తుంగతుర్తి రవి



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** కలిసికట్టుగా ఉన్నప్పుడే కాలనీలు అభివృద్ధి దిశగా పయనిస్తాయని పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి అన్నారు. ఈస్ట్ శ్రీ సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఏర్పాటైన సందర్భంగా కమిటీ ప్రతినిధులను ఆదివారం ఆయన సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అసోసియేషన్ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. మీ నిబద్ధత కాలనీ శ్రేయస్సు దిశగా సాగాలని సూచించారు. నూతన కమిటీకి మా నుండి కానీ, కాంగ్రెస్ పార్టీ నుండి కానీ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. కాలనీ అభివృద్ధికి కమిటీ సభ్యులు అందరూ కలిసి పనిచేయాలని కోరారు. కాలనీ అభివృద్ధి చెందాలంటే అక్కడి ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని, దీనికి ఈస్ట్ శ్రీ సాయి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పడిన వెల్ఫేర్ అసోసియేషన్ ఉదాహరణ అని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారం కోసం కృషిచేయడం.. ఇవన్నీ ఓ సమర్థవంతమైన అసోసియేషన్ వల్లే సాధ్యమవుతాయని ఆయన అన్నారు. తుంగతుర్తి రవి సన్మానించిన వారిలో కాలనీ అధ్యక్షులు కృష్ణ కాంత్, వైస్ ప్రెసిడెంట్ స్వామి నాయక్, జనరల్ సెక్రటరీ సంపత్ కుమార్, జాయింట్ సెక్రటరిలు సత్యనారాయణ, శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లు కోటేశ్వరరావు, మధు, ట్రెసరర్ యాకుబ్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు శ్రీలత భద్రు నాయక్, మణిరామ్ నాయక్, ఉపేందర్, క్రాంతి కుమార్, సత్యనారాయణ గౌడ్, సంపత్ రెడ్డి, జుమ్లా నాయక్, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవార్ల ఆశీస్సులు తీసుకున్న నేతలు

### పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన సింగిరెడ్డి పద్మా రెడ్డి, కొత్త కిషోర్ గౌడ్



**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** శ్రావణ మాస బోనాల పండుగ బోడు ప్పల్ నగరంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భం గా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ అమ్మవార్ల ఆలయా లను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరపాలక సంస్థ సమీపంలోని శ్రీ బంగారు మైసమ్మ ఆలయం, గ్రీన్ సిటీ కాలనీలోని శ్రీ నల్ల పోచమ్మ, ఎన్ఐఎన్ కాలనీ శ్రీ పోచమ్మ తల్లి ఆలయాలను వారు సందర్శించారు. స్థానిక నిర్వాహకులు కొత్త కిషోర్ గౌడ్, సింగిరెడ్డి పద్మా రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అత్యంత వైభవంగా నిర్వహించే "బోనాల" పండుగను బోడుప్పల్ ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపు కోవాలని కోరారు. శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులు ప్రజ లందరిపై ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కష్టసుఖాల్లో పాలువంచుకున్నప్పుడే స్నేహ సంబంధాలు

### సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాము ఎన్కెపల్లిలో ఘనంగా ఫ్రెండ్షిప్ డే



**మొయినాబాద్ రాజముద్ర న్యూస్:** అన్నదమ్ములుగా స్నేహ సంబంధాలు కలిసి మెలిసి ఉండడంతో పాటు కష్టసుఖాలను పాలువంచుకు న్నప్పుడే స్నేహానికి నిదర్శనం అని సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ మండల నాయకుడు కుమ్మరి రాము అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భం గా ఎన్కెపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరువుకున్నారు. ఈ సందర్భంగా దాదావు 40 మంది స్నేహితులంతా ఏకమై విద్యార్థి దశ నుంచి నేటి వ్యాపార ఉద్యోగాలలో స్థిరపడి ఉన్న వారంతా కష్టసుఖాలను పాలుపంచుకున్నారు. ఒకరినొకరు చేస్తున్న ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలను, కష్టసుఖాలను తెలియ జేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. దీంతో స్నేహితుల సంబరాలు ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బీఆర్ఎస్ మండల నాయకులు కుమ్మరి రాము మాట్లాడుతూ...ఎన్కెపల్లి గ్రామంలో చిన్నపెద్దా తారతమ్యం లేకుండా అన్నదమ్ములుగా, స్నేహితులుగా 20 సంవత్సరాల నుంచి ఇలాగే కొనసాగుతుందన్నారు. కలిసి మెలిసి ఉండడం వల్ల కష్టసుఖాలలో పాలుపంచుకునే అవకాశం ఉందన్నారు. ఒంటరిగా ఉంటే ఏమి సాధించలేమని సూచించారు. కలిసి ఉంటే సుఖసంతోషాలను పాలుపంచుకో వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో దానయ్య, సుభాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## అత్యంత వైభవంగా శ్రావణమాస గడి మైసమ్మ తల్లి బోనాలు

- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు
- బోనాలు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు
- అమ్మవారికి కాంగ్రెస్ పార్టీ నేతల ప్రత్యేక పూజలు



**మేడ్చల్, రాజముద్ర న్యూస్:** మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని శ్రీశ్రీశ్రీ గడి మైసమ్మ తల్లి దేవాలయంలో శ్రావణ మాస బోనాలను భక్తులు అత్యంత వైభవంగా భక్తి శ్రద్దల మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీ గడి మైసమ్మ తల్లి బోనాలను ఈ సంవత్సరం సైతం అత్యంత వైభవంగా నిర్వహించారు. మేడ్చల్ తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఇందుకోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కిలోమీటర్ మేరకు విద్యుత్ దీపాలను అలంకరించారు. గడి మైసమ్మ తల్లి అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజామున నుండే భక్తులు శ్రీ గడి మైసమ్మ అమ్మవారి దేవాలయం చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో గడి మైసమ్మ దేవాలయం కిటకిటలాడింది.

**కాంగ్రెస్ నేతల ప్రత్యేక పూజలు :**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ పురపాలక సంఘం కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మేడ్చల్ పట్టణంలో కొలువైయున్న శ్రీశ్రీశ్రీ గడి మైసమ్మ తల్లి శ్రావణ మాస బోనాల జాతర సందర్భంగా ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివ శంకర్ ముదిరాజ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉదండపురం సత్యనారాయణ,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్, మేడ్చల్ పురపాలక సంఘం కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి సంతోష్ గౌడ్, మేడ్చల్ పురపాలక సంఘం ఎస్సీ సెల్ అధ్యక్షులు దండు శ్రీకాంత్ (చింటు), యూత్ కాంగ్రెస్ నాయకులు పిట్ల లక్ష్మణ్ ముదిరాజ్, బట్టు మధు, ఉదయ్ రెడ్డి, చెవిటి అవినాష్, పెగుడ శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

- 3వ డివిజన్ వెంకటరమణ హిల్స్ కాలనీలో ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన
- ప్రతిష్టాపన ఉత్సవంలో పాల్గొన్న తుంగతుర్తి రవి, చిలుముల జగదీశ్వర్ రెడ్డి

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం వెంకటరమణ హిల్స్ కాలనీలో ఘనంగా జరిగింది. పీర్జాదిగూడ నగర 3వ డివిజన్ పరిధిలోని వెంకటరమణ హిల్స్ కాలనీలో వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్యన అమ్మవారి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు తుంగతుర్తి రవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ హిల్స్ కాలనీ కమిటీ అధ్యక్షులు(మాజీ కో ఆప్షన్ సభ్యులు) చిలుముల జగదీశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్, ఆలయ నిర్మాణ కమిటీ ఆహ్వానం మేరకు హాజరైన తుంగతుర్తి రవిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిలుముల అజయ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్, యూత్ నాయకులు సాయిరాం రెడ్డి, కాలనీవాసులు, భక్తులు తదితరులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.




కిలి.. కిల్.. కిల్.. కిల్ అనే శబ్దం వినగానే మనకు గుర్తొచ్చేది సైకిలే.. అప్పట్లో సైకిల్కు భలే మోజు ఉండేది. సైకిలు ఒక సాధారణమైన రవాణా సాధనం. పూర్వపు రోజుల్లో పొరుగు గ్రామాలకు వెళ్లాలంటే సైకిల్ను ఎక్కువగా ఉపయోగించుకునేవారు. బస్సు లేని ఆ రోజుల్లో సైకిల్ పైనే ఆధారపడేవారు. అప్పట్లో సైకిల్ విన్యాసాలు అద్భుతంగా ఉండేవి. పాఠశాలలకు వెళ్లాలన్నా.. తోటకు,దొడ్లకాడికి వెళ్లాలన్నా పదేళ్ల వయస్సు కలిగిన పిల్లలు ఎక్కువగా ఉపయోగించుకునేవారు. ఇది మానవ శక్తితో నడపబడే రెండు చక్రాల వాహనం. దీనిని 19వ శతాబ్దంలో ఐరోపాలో మొదటిసారిగా ఉపయోగించారు. ఇవి మనుషులకు బొమ్మలు, వ్యాయామంలో, మిలటరీ, పోలీస్, సమాచార సరఫరా మొదలైన వివిధ రకాలుగా ఉపయోగపడుతున్నాయి. సైక్లింగ్ ఒక రకమైన క్రీడగా మారింది. రానురాను సైకిల్కు డిమాండ్ తగ్గిపోయాయి. అయితే ఈ మధ్య కాలంలో మళ్లీ రకరకాల డిజైన్లతో కొత్త సైకిళ్లు మార్కెట్లోకి వచ్చాయి. సైకిల్కు ఉన్న ప్రాధాన్యత ఏ వాహనానికి ఉండదని కొంతమంది ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

# సైకిల్...

## పూర్వపు రోజుల్లో సైకిల్ అంటే భలే మోజు

- ఊళ్లకు, పాఠశాలలకు సైకిల్లే ఆధారం
- గతంలో సైకిల్కు తగ్గిన ప్రాధాన్యత
- ప్రస్తుతం పిల్లల వాడకంతో పెరుగుతున్న ఆదరణ
- కానీ.. ఆరోగ్యానికి సైకిలే ముఖ్యం



**మేడ్చల్:** కిల్ కిల్ అని శబ్దం వినగానే మనకు గుర్తొచ్చేది సైకిల్. ప్రతి ఒక్కరికి సైకిల్ తొక్కడం నేర్చుకోవాలని, ఎంచక్కా సైకిల్ పై విహరించాలనే ఉబలాటం ఉంటుంది. పూర్వపు రోజుల్లో తోటలకాడికి, దొడ్ల కాడికి, పొరుగు గ్రామాలకు వెళ్లాలంటే సైకిల్ ను ఎక్కువగా ఉపయోగించేవారు. బస్సు సర్వీసులు లేని ఆ రోజుల్లో సైకిల్ పైనే ఇతర గ్రామాలకు వెళ్లేవారు. కొంతమంది సైకిల్ పై విన్యాసాలు చేస్తూ జీవనం గడిపే వారు కూడా ఉండేవారు. సర్కస్ లో సైకిల్ విన్యాసాలు అద్భుతంగా ఉంటాయి. ఒకప్పుడు పాఠశాలలకు దూరంగా ఉండే ప్రాంతాల విద్యార్థులు సైకిల్ నే ఉపయోగించేవారు. అదే పనిగా వారి బిడ్డలకు సైకిల్ ను తల్లిదండ్రులు కొనిస్తున్నారు. అలాగే సుమారు పది సంవత్సరాలు వయసు వచ్చిన తర్వాత సైకిల్ నేర్చుకోవడం అలవాటు చేసుకుంటారు. కానీ నేటి పిల్లలు నడక నడవడం పూర్తవుగానే సైకిల్ నేర్చుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఇలా సైకిల్ కు ఎంతో ఘన చరిత్ర ఉంది. సైకిల్ అనేది సాధారణమైన రవాణా సాధనమని అంటారు. ఇది మనిషి శక్తిని ఉపయోగించి నడపబడే రెండు చక్రాల వాహనం. దీన్ని 19వ శతాబ్దంలో ఐరోపాలో మొట్టమొదటిసారి ఉపయోగించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలో చైనా దేశంలో సైకిల్ ఎక్కువగా ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. సైకిల్ ను జర్మనీకి చెందిన కార్ల్ వాన్ డ్రైన్ సైకిల్ ను కనుగొన్నట్లు తెలుస్తోంది. 1817లో స్విఫ్ట్ వాకర్ గా పేరు పెట్టారు. మొదట పెడల్స్ లేకుండా ఇనుప చట్రం కాకుండా చెక్కతో తయారు చేయబడింది. ఇనుప రిమ్ లకు లేదర్ టైర్లు అమర్చారు. ఆ తరువాత కొన్ని మార్పులతో అది సైకిల్ గా రూపాంతరం చెందింది. పూర్వపు రోజుల్లో ఒక్కో గ్రామానికి 5 లేదా 8 సైకిల్లు మాత్రమే ఉండేవి. కాలానుగుణంగా సైకిల్ స్థానంలో వివిధ రకాల బైకులు మార్కెట్లోకి వచ్చాయి. యాంత్రిక జీవనం అలవాటు చేసుకున్న తర్వాత ఇప్పుడు సైకిల్ స్థానంలో బైకులు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. కాలానుగుణంగా కూడా చాలా మంది విద్యార్థులు మోటారు సైకిల్ నే ఉపయోగిస్తుండడం విశేషం. శరీరాన్ని దృఢంగా ఉంచడం కోసం సైక్లింగ్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. బరువు తగ్గడానికి కండరాలను బలంగా నిర్మించడానికి, శరీరంలో కొవ్వు పదార్థాలను తగ్గించడానికి సైకిల్ ఎంతో ఉపయోగపడుతుంది. ఇలా సైకిల్ సగటు మనిషి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టమవుతోంది. ఇప్పటికీ కొంతమంది సైకిల్ పైనే ప్రయాణం చేస్తున్నారు. ఎంత దూరమైనా సరే సైకిల్ తొక్కుకుంటూనే వెళుతున్నారు. 80 సంవత్సరాలు వచ్చినా కూడా సైకిల్ తొక్కుతూ వెళ్తున్నారు. సైకిల్ ను ఉపయోగిద్దాం ఆరోగ్యాన్ని సంరక్షించుకుందాం అన్న నినాదంతో ముందుకెళ్తారని ఆశిద్దాం.





## పిల్లల వాడకంతో పెరుగుతున్న ఆదరణ :

సైకిల్ వాడకం గతంలో తగ్గడంతో ప్రస్తుతం పిల్లలు సైకిళ్ల వాడకం పెరగడంతో సైకిళ్ల అమ్మకాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో రకరకాల సైకిళ్లు అత్యాధునిక హంగులతో, గేర్లతో, డిస్క్లతో ఉన్న సైకిళ్లు రావడంతో పిల్లలు నిత్యం సైకిలు కొనుగోలు చేసి తమ పాఠశాలలకు సెలవు రోజులలో రోజంతా, స్కూల్ కొన్ని రోజులలో సాయంత్రం సమయంలో సైకిల్ తొక్కుతూ ఎంజాయ్ చేస్తున్నారు.




# ఆఖిరి టెస్టు రసవత్తరం

- **గెలవాలంటే భారత్‌కు 4 వికెట్లు.. ఇంగ్లాండ్‌కు 35 పరుగులు**
- **బ్రూక్, రూట్ శతకాలు**

**లండన్:** భారత్, ఇంగ్లాండ్ మధ్య వరుసగా అయిదో టెస్టు అయిదో రోజుకు చేరింది. ఆఖరి మ్యాచ్ రసవత్తర ముగింపు దిశగా సాగుతోంది. 374 పరుగుల లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 50/1తో నాలుగో రోజు, ఆదివారం బ్యాటింగ్ కొనసాగించిన ఇంగ్లాండ్.. ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. బ్రూక్ (111, 98 బంతుల్లో 14(4), 2(6)), రూట్ (105, 152 బంతుల్లో 12(4))ల అదిరే శతకాలతో ఆ జట్టును పైచేయిలో నిలిపారు. కానీ ఆఖర్లో పుంజుకున్న టీమ్‌ఇండియా.. పోటీలోకి వచ్చింది. వర్షం కారణంగా కాస్త ముందే ఆట ముగిసింది. జేమీ స్మిత్ (2), ఒవర్టన్ (0) క్రీజులో ఉన్నారు. ఇంకో 3.4 ఓవర్లలో రెండో కొత్త బంతి రానుండడం భారత్‌కు కలిసొచ్చే విషయమే. గాయం కారణంగా వోక్స్ బ్యాటింగ్‌కు రావడం సందేహమే. తొలి ఇన్నింగ్స్‌లో అతడు బ్యాటింగ్‌కు దిగలేదు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 224 పరుగులకు ఆలౌట్ కాగా.. ఇంగ్లాండ్ 247 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 396 పరుగులు సాధించింది.

### బాగానే మొదలెట్టినా..

నాలుగో రోజును టీమ్‌ఇండియా బాగానే మొదలెట్టింది. మూడో రోజు ఆఖరి బంతికి క్రాలీని ఔట్ చేసిన సిరాజ్.. ఆదివారం ఆకాశ్‌దీప్‌తో కలిసి దాడిని ఆరంభించాడు. పదునైన స్పెల్‌తో డకెట్ (ఓవర్‌నైట్ 34), ఒలీ పోప్ డకెట్‌లను పరీక్షించాడు. కానీ నాలుగో రోజు ప్రత్యర్థి వికెట్ల పతనాన్ని ఆరంభించింది మాత్రం ప్రసిద్ధ్‌కృష్ణనే. ప్రసిద్ధ్ బంతిని డ్రైవ్ చేయబోయిన డకెట్ (54).. రెండో స్లిప్‌లో దొరికిపోయాడు. పట్టుదలతో బ్యాటర్లపై ఒత్తిడి పెంచిన సిరాజ్ కూడా ఎట్టకేలకు ఫలితం రాబట్టాడు. అతడు సీమ్‌ను ఉపయోగించుకుంటూ పోప్ (27)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అప్పటికి ఇంగ్లాండ్ స్కోరు 106. పోప్ సమీక్షకు వెళ్లినా ఫలితం లేకపోయింది. అతడు తొలి ఇన్నింగ్స్‌లోనూ సిరాజ్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. అయితే మరోవైపు రూట్ నిలవగా బ్రూక్ ధాటిగా ఆడడంతో లంచ్ వేళకు ఇంగ్లాండ్ 164/3తో నిలిచింది. రూట్ కూడా అలవోకగా బ్యాటింగ్ చేయడంతో ఇంగ్లాండ్ విజయంవైపు సాగింది. స్కోరు మూడొందలు దాటడంతో ఆ జట్టు విజయం తేలికే అనుకున్నారంతా!

### తిరిగొచ్చిన ఆశ

106కే మూడు ఇంగ్లాండ్ వికెట్లు పడగొట్టినా బ్రూక్, రూట్ సూపర్ బ్యాటింగ్‌తో టీమ్‌ఇండియా వెనుకబడిపోయింది. చెలరేగి ఆడిన బ్రూక్.. భారత్ ఆశలపై నీళ్లు చల్లాడు. బలమైన షాట్లు బాదుతూ ఎడాపెడా బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. లంచ్‌కు ముందు సిరాజ్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన బ్రూక్.. అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకున్నాడు. లంచ్ తర్వాత కూడా జోరు కొనసాగించాడు. అతడు 39 బంతుల్లోనే అర్ధశతకాన్ని అందుకోవడం విశేషం. రూట్ కూడా ఎలాంటి తడబాటు లేకుండా బ్యాటింగ్ చేస్తూ పరుగులు రాబట్టాడు. వీలైనప్పుడల్లా బంతిని బౌండరీ దాటించాడు. అతడు 81 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. ముగ్గురు భారత పేసర్లు కూడా ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. స్పిన్నర్లూ అంతే. బ్యాటర్లపై పేసర్ల షార్ట్ బంతి వ్యూహం ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. బ్రూక్, రూట్ ఆ బంతులను అలవోకగానే ఎదుర్కొన్నారు. బ్రూక్ 91 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. జోరు కొనసాగిస్తూ ఆకాశ్‌దీప్ బౌలింగ్‌లో అతడు వరుసగా రెండు బంతులను బౌండరీ దాటించడంతో ఇంగ్లాండ్ స్కోరు 300 దాటింది. భారత ఆటగాళ్లలో నిరాశ స్పష్టంగా కనిపించింది. కానీ ఆకాశ్‌దీప్ తర్వాతి బంతిని ఆడే ప్రయత్నంలో బ్రూక్ బ్యాటును చేజార్చుకున్నాడు. బ్యాటును తాకి గాల్లోకి లేచిన బంతిని మిడాఫ్‌లో సిరాజ్ తేలికగా అందుకున్నాడు. టీ విరామానికి కాసేపు ముందు పడ్డ ఆ వికెట్ భారత్‌కు ఊరటే. కానీ అప్పటికి ఇంగ్లాండ్ విజయానికి కావాల్సింది 73 పరుగులే. పైగా బెతెల్ అండగా రూట్ చక్కని బ్యాటింగ్ కొనసాగించడంతో ఇంగ్లాండ్ విజయం వైపు సాగింది. టీ విరామం తర్వాత ఓ దశలో స్కోరు 332/4. ఇంగ్లాండ్ గెలుపు ఇక లాంఛనమే అనిపించింది. భారత్‌కు ఎలాంటి అవకాశమూ కనపడలేదు. కానీ అనూహ్యంగా మళ్లీ భారత్ ఆశలు చిగురించాయి. ప్రసిద్ధ్ వరుస ఓవర్లలో బెతెల్ (5), రూట్‌ను ఔట్ చేయడంతో టీమ్‌ఇండియా పోటీలోకి వచ్చింది. బెతెల్ బౌల్డయ్యాడు. ఆఖరి వరకు క్రీజులో నిలిచేలా కనిపించిన రూట్.. ప్రసిద్ధ్ బంతిని డ్రైవ్ చేయబోయి వికెట్‌కీపర్ జురెల్ చేతికి చిక్కాడు. అంతే టీమ్‌ఇండియా మైదానంలో రెట్టించిన ఉత్సాహంతో కదిలింది. పేసర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బ్యాటర్లు జేమీ స్మిత్, ఒవర్టన్‌లపై ఒత్తిడి పెంచారు. ఏమాత్రం స్వేచ్ఛగా ఆడనివ్వలేదు. పరుగులు రాబట్టడం వాళ్లకు కష్టమైపోయింది. ప్రతి బంతికీ కూడా వికెట్ పడేలా కనిపించింది. హఠాత్తుగా భారత్‌కు కూడా మ్యాచ్‌లో గెలుపు అవకాశాలు ఏర్పడ్డాయి. రూట్ ఔటయ్యాక 20 బంతుల్లో ఇంగ్లాండ్ రెండు పరుగులే చేయడం గమనార్హం. వెలుతురులేమి కారణంగా ఆట ఆగగా.. ఆ తర్వాత వర్షం కూడా మొదలైంది. దీంతో నాలుగో రోజు ఆట త్వరగానే ముగిసింది.



### ఆ క్యాచ్ పట్టుంటే..

అద్భుతమైన బౌలింగ్‌తో అందరి మన్ననలు పొందిన ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ సిరాజ్.. నాలుగో రోజు ఓ ఖరీదైన తప్పు చేశాడు. అతడు క్యాచ్ చేజార్చడంకు టీమ్‌ఇండియాకు పెద్ద నష్టమే చేసింది. ఇంగ్లాండ్ ఛేదనలో 35వ ఓవర్ అది. ఉదయం అప్పటికే రెండు వికెట్లు పడగొట్టిన భారత్ మంచి స్థితిలోనే ఉంది. జట్టును గట్టెక్కించడానికి ప్రయత్నిస్తోన్న రూట్, బ్రూక్‌లపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. అప్పుడు ప్రసిద్ధ్ బౌలింగ్‌లో బ్రూక్ ఫైన్ లెగ్‌లో పుల్ షాట్ ఆడాడు. బంతి గాల్లోకి లేచింది. బౌండరీ వద్ద సౌకర్యంగానే నిలబడ్డ సిరాజ్.. బంతిని ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుకున్నాడు. కానీ అనూహ్యంగా తడబడి బౌండరీ కుషన్‌ను కాలితో తాకి, బయట అడుగుపెట్టాడు. అది సిక్సయిపోయింది. అప్పటికే సంబరాలు మొదలెట్టిన ప్రసిద్ధ్.. చివరికి తీవ్ర నిరాశకు గురయ్యాడు. మిగతా ఫీల్డర్లు, అభిమానులూ అంతే. సిరాజ్ కూడా తన వైఫల్యాన్ని తానే నమ్మలేకపోయాడు. అతడు క్యాచ్ వదిలేయడమే మ్యాచ్‌లో మలుపు అనుకోవచ్చు. అప్పటికి ఇంగ్లాండ్ 137/3తో ఉంది. వ్యక్తిగత స్కోరు 19 వద్ద బతికిపోయిన బ్రూక్.. ఆ తర్వాత చెలరేగిపోయాడు. ఎడాపెడా బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సిరాజ్ క్యాచ్ పట్టుంటే మ్యాచ్‌లో భారత్ పరిస్థితి భిన్నంగా ఉండేదే.







## గిల్‌కు గావస్కర్ బహుమతి

**లండన్:** భారత టెస్టు క్రికెట్లో ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు రాబట్టిన బ్యాటర్ రికార్డును త్రుటిలో చేజార్చుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ ప్రత్యేక బహుమతి అందించాడు. అండర్సన్- తెందుల్కర్ ట్రోఫీలో అయిదు మ్యాచ్‌ల్లో కలిపి 10 ఇన్నింగ్స్‌ల్లో గిల్ 754 పరుగులు సాధించాడు. మరో 21 పరుగులు చేసుంటే గావస్కర్ (774) రికార్డును గిల్ బద్దలు కొట్టేవాడు. అయితే తన రికార్డును అందుకోనప్పటికీ గిల్‌ను ప్రశంసిస్తూ గావస్కర్ బహుమతి అందించాడు. తన సంతకంతో కూడిన టోపీ, షర్ట్‌ను అందజేశాడు. "ఇదో చిన్న టోపీ. నా సంతకంతో చాలా తక్కువ మందికి ఇస్తా" అని గిల్‌తో గావస్కర్ అన్నాడు.





## రెజాంగ్ లా యుద్ధంలో రాశీ ఖన్నా?

'ది సబర్మతీ రిపోర్ట్', 'యోధ' లాంటి చిత్రాలతో గతేడాది మంచి విజయాన్ని అందుకుంది కథానాయిక రాశీ ఖన్నా. ఇటీవలే పవన్ కల్యాణ్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'లో నటించే అవకాశాన్ని సొంతం చేసుకుందీమె. ఇప్పుడు రాశి మరో ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ దర్శకుడు, నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం '120 బహాదుర్'. రజనీశ్ ఘాయ్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో రాశి ఓ కీలక పాత్రలో మెరవనుందట. త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. 1962లో జరిగిన ఇండో-చైనా యుద్ధంలో ముఖ్యమైనదిగా గుర్తింపు పొందిన రెజాంగ్ లా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్ జీవితం ఆధారంగా దీన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాను ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది.

## ఆ డైరెక్టర్ వల్ల చాలా ఇబ్బంది పడ్డాను..

### టాలీవుడ్ హీరోయిన్ షాకింగ్ కామెంట్స్!

దిశ, సినిమా: టాలీవుడ్ యంగ్ బ్యూటీ కోమలి ప్రసాద్ 'నేను సీతా దేవి' సినిమాతో సినీ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత రౌడీ బాయ్స్, అనుకున్నది ఇకటి అయింది ఒకటి వంటి మూవీస్ చేసి అమ్మడు అనతి కాలంలోనే మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఇక 'హిట్-3' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. ఈ ఒక్క ప్రాజెక్ట్‌తో అమ్మడు రేంజ్ మారిపోయింది. ప్రస్తుతం 'శశివదనే' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కోమలి ప్రసాద్ షాకింగ్ కామెంట్స్ చేసింది. "శైలేష్ కొలను సెట్‌లో మాట్లాడే భాషనే నాకు పెద్ద సమస్యగా అనిపించింది. తెలుగును విరగగొట్టి మాట్లాడటం వల్ల అర్థం కాదు. ఎక్స్‌ప్రేషన్ ఇవ్వకుండా మాట్లాడతారు. మొదట్లో ఆయన స్టైల్ అర్థం కాక ఇబ్బంది పడ్డాను. కానీ ఆయన ఇచ్చిన అవకాశం వల్లనే మంచి విజయం సాధించాను. శైలేష్ కొలనుతో పని చేయడం నిజంగా గొప్ప అనుభవం" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.






## పాక్ క్రికెటర్‌తో పెళ్లి రూమర్స్: తమన్నా రియాక్షన్ ఇదీ

పాక్ క్రికెటర్ అబ్దుల్ రజాక్- నటి తమన్నా వివాహం చేసుకోబోతున్నారంటూ గతంలో వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ఓ ఇంటర్వ్యూలో ఆ ప్రచారంపై తమన్నా స్పందించారు. ఆ రూమర్స్‌ను ఖండించిన ఆమె.. సోషల్ మీడియాలోనే ఇలాంటి గాసిప్స్ క్రియేట్ అవుతాయని అభిప్రాయపడ్డారు. ఓ జ్యువెల్లరీ షాపు ప్రారంభోత్సవానికి అబ్దుల్‌తో కలిసి హాజరయ్యానని గుర్తుచేసుకున్నారు. మరోవైపు, విరాట్ కోహ్లీతో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు రూమర్స్ రావడంపైనా తమన్నా రియాక్ట్ అయ్యారు. తాను విరాట్‌ను ఒకసారి మీట్ అయ్యానని, ఆ సమయంలో ఇలాంటి ప్రచారం జరగడం బాధగా అనిపించిందన్నారు. ఆ తర్వాత మళ్లీ కోహ్లీని కలవలేదన్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com